తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు నిర్ణిత గడువులోపు పూర్తి చేయాలి

## -స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. మౌర్య



స్మార్ట్ సిటీ సమీక్షా సమావేశంలో కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 17 ప్రభాతవార్త : స్మార్ట్ సిటి ప్రాజెక్టులు నిర్ణిత గడువులోపు పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పనులు పురోగతిపై నిర్మాణ సంస్థల ప్రతినిధులు, స్మార్ట్ సిటి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. మౌర్య మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న ప్రాజెక్టులు గడువు సమీపిస్తున్న పనులు ఆలస్యంగా ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. అన్ని ప్రాజెక్టులు ఇచ్చిన గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాత మునిసిపల్ కార్యాలయం స్థానంలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ పనులను సకాలంలో త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గరుడ వారధిలో పెండింగ్ లో ఉన్న పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని ఆ సంస్థ ప్రతినిధులు ఆదేశం చారు. ముఖ్యంగా కోర్లగుంట వద్ద పెండింగ్ లో ఉన్న డ్రైనేజీ కాలువల నిర్మాణం పూర్తి చేయాలని, న్యాయపరమైన సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. మల్టి లెవల్ కార్ పార్కింగ్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణాల్లో ప్రభుత్వ పరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని అన్నారు.

వినాయక సాగర్ లో గ్లో గార్డెన్ పనులు పూర్తి చేయాలని అన్నారు. క్రికెట్ స్టేడియం లో పెండింగ్లో ఉన్న పనులు పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈ.ఈ.లు చంద్రశేఖర్, డి.ఈ.లు రాజు, మధు, వెంకట ప్రసాద్, డి.సి.పి. మహాపాత్ర, స్మార్ట్ సిటీ ఏ.ఓ.రాజశేఖర్, సి.ఎఫ్.ఓ. మల్లికార్జున, ఏఈకాం ప్రతినిధులు బాలాజి, అనిల్, వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### వైకుంఠద్వార దర్శనాలకు...

# తిరుపతిలో సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు !

**-జనవరి 8రాత్రి నుండి జారీకి ఆలోచన -తిరుపతిలో 8 ప్రాంతాలు,తిరుమలలో ఒకచోట**



తిరుమల, డిసెంబర్ 17 ప్రభాతవార్తప్రతినిధి: పరమపవిత్రమైన మోక్షమార్గం తిరుమలేశుని ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఆఫ్‌లైన్‌లో తిరుపతిలో టోకెన్లు జారీకి టిటిడి సిద్ధమవుతోంది. జనవరి 10వతేదీ నుండి 19వరకు పదిరోజులు తెరచివుంచే వైకుంఠద్వార దర్శనాలకు సామాన్యభక్తులు, తిరుపతి,తిరుమల,చంద్రగిరి, రేణిగుంట, ఆర్‌సిపురం మండలాల స్థానికుల సౌలభ్యం కోసం ఆఫ్‌లైన్‌లో సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేస్తారు. ఈ టోకెన్లను రానున్న జనవరి 8వతేదీ రాత్రి నుండిగానీ, 9వతేదీ వేకువజామున 3గంటల నుండి జారీచేయాలని ఆలోచన చేస్తున్నారు. తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవికాంప్లెక్స్, రామచంద్రపుష్కరిణి, ఇందిరా మైదానం, జీవకోనలోని జడ్పీ ఉన్నత పాఠశాల, బైరాగిపట్టెలోని రామానాయుడు ఉన్నతపాఠశాల, ఎంఆర్‌పల్లిలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో ఉచితంగా టోకెన్లు జారీ చేయనున్నారు. తిరుమలవాసులకు స్థానికంగానే కౌస్తుభం విశ్రాంతి భవనంలో టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేస్తారు.ఈ టోకెన్లను అందుకో వడానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున టిటిడి, పోలీసు, విజిలెన్స్‌సంయుక్తంగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని టిటిడి ఈఓ శ్యామల రావు అధికారులను ఆదేశించారు. పదిరోజుల సర్వదర్శనం టోకెన్లు టోకెన్లు పూర్తయ్యే వరకు నిరంత రాయంగా జారీచేస్తారు. భక్తులు ఆధార్‌కార్డులు తీసుకుని క్యూలైన్లలో నిలబడితే వారి వరుసవచ్చిన వెంటనే టోకెన్ అందుకోవచ్చు. టోకెన్లు కలిగిన భక్తులకు కౌంటర్ల వద్ద సకల సౌకర్యాలు కల్పిస్తారు. వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఏర్పాట్లు, టిక్కెట్లు విడుదల విషయంపై మంగళవారం సాయంత్రం అన్నమయ్య భవనంలో టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓ వీరబ్రహ్మం,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

### గ్రామాల అభివృద్ధికి అవసరమైన...

# ప్రణాళికలు సిద్ధం చేయండి

**-ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వెచ్చించాలి**
**-మామిడికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన పెంచండి**
**-జిల్లా కలెక్టర్**



నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కాణిపాకం,డిసెంబర్ 17 ప్రభాతవార్త: గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసి రానున్న రోజుల్లో వాటిని అమలు చేసేందుకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కాణిపాకం ఎల్‌బి కళ్యాణ మండపంలో స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికపై సమీక్షా సమావేశంకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసు కుని గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసి రానున్న రోజుల్లో వాటి అమలు సన్నద్ధం కావాలని తెలిపారు. ప్రభుత్వం నుండి విడుదలయ్యే ప్రతి పైసా పారదర్శకంగా వెచ్చించి ప్రజలకు అవసరమైన వసతులు కల్పించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాలలో త్రాగునీరు, విద్యుత్, డ్రైనేజిలు వంటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మండల స్థాయి లో సంభందిత శాఖ సమన్వయ సమావేశంలో చర్చించి భవిష్యత్ ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. పూతలపట్టు నియోజకవర్గంలో మామిడిసాగు విస్తారంగా వుందని, ప్రస్తుత పరిస్థితుల్లో మామిడి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మారేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గోకులం షెడ్లకు సంభందించి ఇప్పటికే లక్ష్యాన్ని కేటాయించడం జరిగిందని వీటిని త్వరితగతిన పూర్తి చేయాలనా న్నరు.

**సీఎం, డిప్యూటీ సీఎంల ఆశించిన రీతిలో పూతలపట్టు అభివృద్ధి: ఎమ్మెల్యే మురళీమోహన్**

సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశించిన రీతిలో పూతలపట్టులో ప్రగతి జరగాలన్నదే తన ఆలోచన అని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. నియోజవర్గ అభివృద్ధి ప్రణాళిక సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజన్-2047 చంద్ర బాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా నియోజవర్గం లో విజన్ ప్రణాళికలను సిద్ధం చచేసుకుంటు న్నానన్నారు. 204 నాటికి గ్రామాలు, మండలాలు ఎలా వుండాల్లో ఆమేరకు సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకుని మరో మూడునెలల్లో ఆప్రణాళికలు ఎలా అమలు చేయాల్లో సమీక్షాసమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.అలాగే ఉపాధి హామీ పథకంలో భాగంగా స్మశాన వాటికలకు స్థలాన్ని, వాటికి దారి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మురళీమోహన్ కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఆడవిపల్లి రిజర్వాయర్ పైపులైను ద్వారా ఐరాల మండలంలోని 10 గ్రామాలకు త్రాగునీరు అందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సీసీ అ ప్రోచ్‌రోడ్లు నిర్మాణం, అండర్ డ్రైనేజి నిర్మాణం, త్రాగునీటి ఎద్దడి, విద్యుత్ కనెక్షన్లు దారి సమస్యలు వంటి వాటిపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చించారు.ఈసమావేశంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈసమావేశంలో హౌసింగ డీఈ పద్మనాభం, జడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, డీపీఓ సుధాకర్‌రావు, డీఎంఅండహెచ్ఓ ప్రభావతిదేవి, ఎస్ఈఓలు విజయ్‌కకుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విజయ్‌కుమార్, డ్వామా పీడి రవికుమార్, సీపీఓ సాంబశివారెడ్డి, డీఈఓ వరలక్ష్మి, వ్యవసాయ, ఉద్యానవన డీడీలు మురళీకృష్ణ, మధుసూధన్‌రెడ్డి, డీఎల్‌పీఓ రవికుమార్, ఎంపీడీఓ ధనలక్ష్మీలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతి నిధులు ఎంపీడీఓలు,తహశీల్దార్‌లు సంభందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతులకు త్వరలో... పరికరాలు పంపిణీ

## - కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు



దివ్యాంగులు, వయోవృద్ధుల ఉపకరణాల నమోదు శిబిరంలో కలెక్టర్, ఎమ్మెల్యే

చిత్తూరు, డిసెంబర్ 17 ప్రభాతవార్త: ఉపకరణాల కోసం ప్రస్తుతం నిర్వహిస్తున్న శిబిరాల్లో నమోదు చేసుకున్న విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు రెండు నెలల్లో ఉపకరణాల పంపిణీకి చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు అన్నారు. భారత ప్రభుత్వ సంస్థ ఎల్ఐఎంసిఓ ద్వారా జిల్లాలో మంగళ వారం నుండి ఈ నెల 24వ తేదీ వరకు విభిన్న ప్రతిభా వంతులు, వయోవృద్ధులకు ఉపకరణాల నమోదుకు నిర్వహి స్తున్న గుర్తింపు శిబిరాలను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు పిసిఆర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ భారత ప్రభుత్వంచే జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ జీవన పరికరాల పంపిణీ కోసం జిల్లా యంత్రాగం, భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ సౌజన్యంతో కృత్రిమ అవయవాల తయారీ సంస్థ(ఎల్ఎంఐసిఓ) సహాయ పరికరాల గుర్తింపు శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. చిత్తూరు పిసిఆర్ ప్రభుత్వ పాఠశాలలో ఈ శిబిరంను మంగళవారం ప్రారంభించడం జరిగిందని, బుధవారం ఎస్ఆర్ పురం జడ్పీ ఉన్నత పాఠశాల, గురువారం పూతలపట్టు జడ్పీ ఉన్నత పాఠశాల, శుక్రవారం నగరి పిసిఎన్ ప్రభుత్వ బాలుర పాఠశాల్లో శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరాలను వయోవృద్ధులు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకుని వారికి అవసరమైన ఉపకరణాలను పొందాలని కోరారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత శిబిరాల్లో కృత్రియ అవయవాల కోసం నమోదు చేసుకున్న వారికి రెండు నెలల్లో అవయవాల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. దివ్యాంగుల్లో 95 శాతం చెవుడు వున్న వారికి, ఒక కాలు లేని వారికి సరిపడ కొలతలు తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు నెలల్లో కృత్రిమ ఉపకరణాలు అందించేలా ఏర్పాట్లు చేపడుతున్నాయన్నారు. ఈ శిబిరానికి హాజరైన ప్రతి వికాలంగుడి సమస్యను తెలుసుకుని ప్రతి ఒక్కరికి మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున దివ్యాంగులు హాజరు కావడం శుభపరిణామం అన్నారు. జిల్లాలో 9 రోజుల పాటు ఈ శిబిరాలు జరుగు తాయని, అంగవైకల్యం వున్న వారు ఈ శిబిరాలకు వెళ్ళి వారి పేరు, సమస్యను నమోదు చేసుకోవాలని కోరారు. ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమశాఖ ఎడి శ్రీనవాస్ మాట్లాడుతూ ఈ శిబిరాలకు హాజరయ్యే దివ్యాంగులు యుడిఐడి కార్డు, రసీదు, ఆధార్ కార్డు, సదరం ధృవీకరణపత్రం, రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, నాలుగు ఫోటోలు తీసుకుని శిబిరంలో రెండు సెట్లు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, జిల్లా రెవెన్యూ అదికారి మోహన్‌కుమార్, చుడా ఛైర్‌పర్స న్ కఠారి హేమలత, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి, అర్డీఓ శ్రీనివాసులు, డిప్యుటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్తును పొదుపు చేయాలి : డిఇఇ





సమావేశంలో మాట్లాడుతున్న డి ఈ ఈ

వెంకటగిరి, డిసెంబర్ 17 ప్రభాతవార్త : భావితరాలకు ఇబ్బంది లేకుండా ప్రతి ఒక్కరూ విద్యుత్తును నేడు పొదుపు చేయాలని ఆ శాఖ డీఇఇ ముని రవిచంద్ర తెలిపారు. పట్టణంలోని పాల కేంద్రం వద్దనున్న స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యుత్ పొదుపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఇ మాట్లాడుతూ నేటి విద్యుత్ పొదుపే రేపటి భావితరాల వెలుగులకు సాకారం అవుతుందని అన్నారు. అంతేకాకుండా ఇంటి నిర్మాణాల్లో వాడే వైర్లు ఇతర ఎలక్ట్రికల్ సామగ్రి నాణ్యమైన పరికరాలు ఉపయోగిస్తే విద్యుత్‌లో పొదుపు చేసే అవకాశం ఉంటుందన్నారు. అంతే కాకుండా అవసరం లేనప్పుడు ఇంటి ఆవరణలో లేదా ఇంటి లోపల కరెంటు స్విచ్‌లను ఆఫ్ చేసి ఉంచాలని కోరారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ప్రతి విద్యుత్ ఉద్యోగ కూడా విద్యుత్ పొదుపుపై అవగాహన కలిగి వినియోగదారులకి రైతులకి తెలియజేయాలని కోరారు. అదేవిధంగా ప్రధానమంత్రి సూర్య గర్ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీపై బ్యాంకు రుణాల ద్వారా ఇంటి పైకప్పున సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు ఇవ్వడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. అంతేకాకుండా విద్యుత్ కి సంబంధించిన ఏదైనా సమస్య తలెత్తినప్పుడు వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేస్తే సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు జయచంద్రరెడ్డి, అశోక్ కుమార్‌రెడ్డి, అశోక్, జూనియర్ ఇంజనీర్లు, పట్టణ మూడు మండలాల విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీ,ఎస్టీ నివాసగృహాలపై 3కిలోవాట్ల విద్యుత్ ప్రాజెక్టులు

**ప్రభాతవార్త-తిరుపతి:**

ఇప్పటికే తడిసి మోపెడవుతున్న విద్యుత్ బిల్లులతో సామాన్య, పేద, మధ్య తరగతి వర్గాలు విలవిలలాడి పోతున్నాయి. పెరిగిన విద్యుత్ ఛార్జీల భారంతో కరెంట్‌బిల్లు షాక్ కొట్టేపరిస్థితులు వచ్చాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా సామాన్యుడి నుండి ధనవంతుల వరకు విద్యుత్ వాడకం తప్పనిసరి. అయితే ఇప్పటికే ప్రభుత్వాలు వెనుకబడిన వర్గాలు ఎస్సీ,ఎస్టీ గృహావసరాలకు వందయూనిట్లు వరకు విద్యుత్ బిల్లులు సర్‌ఛార్జి కూడా అమలుచేసింది. అయినా పేదవర్గాలు విద్యుత్ బిల్లుల భయం వీడటం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ బడుగుపేద వర్గాలను సౌరవిద్యుత్ వెలుగులు దిశగా అడుగులేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా ఎస్సీ,ఎస్టీ ప్రజలు నివాసముంటున్న ఇళ్ళపై సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించేందుకు నిర్ణయించింది. ఇందులో తిరుపతి ఎస్‌పిడిసిఎల్ ప్రధాన కార్యాలయం పరిధిలో ఆరేడు జిల్లాలు వున్నప్పటికీ తిరుపతి, చిత్తూరుజిల్లాలో చాలావరకు గ్రామీణ ప్రాంతా ల్లోనే నివాసముంటున్న ఎస్సీ,ఎస్టీ ప్రజలకు ఉచితంగా సౌరవిద్యుత్ ప్రాజెక్టులు అమర్చేందుకు చూడనున్నారు. తిరుపతి జిల్లాలో 62,795 గృహాల విద్యుత్ కనెక్షన్‌లు ఉండగా, చిత్తూరుజిల్లాలో 80,609 విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నట్లు సమాచారం. ఈ వినియోగదారులకు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం క్రింద లబ్దిదారుల ఇళ్ళపై 3 కిలోవాట్ల విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ మినహాయించి మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వమే భరించనుందని తెలుస్తోంది. దీనివల్ల విద్యుత్‌తో ప్రమాదాలు తగ్గడమేగాక పేద,బడుగు వర్గాలను సౌరవిద్యుత్‌వెలుగులకు దగ్గరగా తీసుకెళ్ళే అవకాశం కలుగుతుంది. మరీ రానున్న రెండు నెలల్లో ఈ ప్రాజెక్టు అమలుకానుందని సమాచారం. ఈ విషయంగా ఎస్పీడిసిఎల్ అధికారవర్గాలు సమాచారం అందితే తదనుగుణంగా ప్రణాళికలు రూపొందించనున్నారు.

# రోడ్ల దుస్థితి చూడండి!

## -ఆర్అండ్‌బీ ఏఈని నిలదీసిన సర్పంచ్‌లు





సత్యవేడు, డిసెంబరు 17 ప్రభాత వార్త: సత్యవేడు మండల సర్వసభ్య సమావేశంలో రోడ్ల దుస్థితిపై పలువురు గ్రామ సర్పంచ్‌లు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళ వారం జరిగిన సత్యవేడు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన జరిగింది. పలు వురు సర్పంచ్‌లు రోడ్ల అధ్వానపు పరిస్థితిపై నిప్పులు కక్కారు. గోతులు బావులను తలపించే విధంగా రోడ్లు ప్రమాద భరితంగా తయారైందని, తరచూ ప్రమాదాలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే మీ నిర్లక్ష్యం ఏంటి...? యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలనే ఆలోచన రాకపోవడం అన్యాయమైన విషయమని సర్పంచ్‌లు రవిరెడ్డి, రూబన్, శేఖర్ తదితరులు ఇన్‌చార్జి ఏఈ ఇజ్రాయిల్‌ను చుట్టు ముట్టి నిలదీశారు. సత్యవేడు-ఊత్తుకోట రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పలు చోట్ల స్పిడ్‌బ్రేకర్లు దెబ్బతిని ఉన్న వాటిని మరమ్మతులు చేపట్టకపోవడం మీ శాఖ నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యమని ఆయనను ప్రశ్నలతో ముంచెత్తారు. తప్పకుండా చేస్తా..యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తా అంటూ ఇజ్రాయిల్(ఏఈ) సమాధనం ఇచ్చేయడం జరిగింది. కొత్తగా చెన్నేది వద్ద స్పిడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అక్కడ సర్పంచ్ రవిరెడ్డి అధికారులను కోరారు. సబ్సిడీపై ఇళ్ళ మీద సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చునఇ చెవి సబ్ ఇంజనీర్ జగదీష్ కోరారు. మండలానికి పక్కా గృహాలు 1505 మంజూరైందని, ఇందులో 685 గృహాలు పూర్తయిందని సమంత శాఖ ఏఈ భానుప్రకాష్ వెల్లడించారు. 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల ఉన్న ఆడ పిల్లలు అందరికి ఈ పథకం వర్తిస్తుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి దేవకుమారి వెల్లడించారు. ఇదిలా ఉండగా పశు సంవర్ధకశాఖలో జరుగుతున్న లంచాల బాగోతాన్ని అక్కడి ఎంపీటీసీ సరస తనదైన శైలిలో సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇదిలా ఉండగా తన సొంత ఊరు అమావాస్యరెడ్డి కండ్రిగలో సిమెంటు రోడ్డు నిర్మాణం కొరకు కంకర పేర్చిన అధికారులు నిర్మాణాలను విస్మరించారని జిల్లా పరిషత్ సభ్యురాలు విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పనులు సకాలంలో పూర్తి చేయకపోవడం వల్ల ఆ పని రద్దయిందని, కొత్తగా ప్రతిపాదనలు నిధులు తెప్పించి రోడ్డు సమస్య తీరుస్తామని పంచాయతీరాజ్ ఏఈ ఇబ్రహిం పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో చంద్రశేఖర్, ఉపాధిహామీ పథకం ఏపీవో కృష్ణయ్య, వైద్య అధికారులు గుణశేఖర్, అనిత, చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

# భూ కబ్జాదారుల బారి నుండి కాపాడండి

## -కబ్జాదారుల భరతం పట్టండని...ఎమ్మెల్యే ఆరణి ఆదేశం





ఆటో నగర్ రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి, టిడిపి నాయకులు

తిరుపతి,డిసెంబర్ 17ప్రభాతవార్త: తిరుపతి నియోజకవర్గం ఆటోనగర్ పరిసరాల్లో భూకబ్జాదారులు ఎక్కువయ్యారని, ఒకరికి సంబంధించిన స్థలాలను మరొకరు అన్యాయంగా,అక్రమంగా ఆక్రమించుకుని దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని పలువురు బాధితులు తమ గోడు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు వినిపించారు. ఆక్రమణదారులు ఎంతటికైనా తెగిస్తున్నారని, పోలీసులు సివిల్ వివాదాలని నిజమైన బాదితులకు న్యాయం చేయలేక పోతున్నారని విన్నవించారు. స్వయంగా మీరు ఇలాంటి కబ్జారాయుళ్ళ భరతంపట్టేలా రెవెన్యూ,పోలీసు అధికారులకు ఆదేశాలివ్వాలని పలువురు బాధితులు విజ్ఞప్తి చేశారు. బాధితుల నుండి మొర విన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అక్కడికక్కడే ఆటోనగర్‌లో భూ కబ్జాలపై చర్యలు తీసుకోండని రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చారు. మంగళవారం ఆటో నగర్‌లో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఇంటిస్థలాల కోసం 62మంది వినతిపత్రాలు అందజేశారు. 76అర్జీలు వివిధ రకాల రెవెన్యూ సమస్యలపై వచ్చాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు తాశీల్దార్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఆటోనగర్‌లో సత్యసాయి ట్రస్ట్‌కు ఇచ్చిన స్థలాన్ని వైసిపి కార్పొరేటర్,అతని అనుచరుడు నాగేశ్వర రావు ఆక్రమించారని ఎన్‌డిఎ నాయకులు చల్లాబాబ్జి, పెంచలయ్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే ఆరణి కోరారు. ఆటోనగర్ పరిధిలో నిషేధిత జాబితాలో ఉన్న భూముల్లో నివాసముంటున్న వారికి ఎలా మేలుచేయాలనే విషయంపై నివేదిక ఇవ్వాలని తాశీల్దార్ భాగ్యలక్ష్మికి ఆదేశించారు. .సత్యసాయిట్రస్టు భూమి ఆక్రమణపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు నరసింహాయాదవ్, క్లస్టర్ ఇన్‌ఛార్జి కృష్ణయాదవ్, రామాయాదవ్, కమల్‌నాయుడు, నాని, జనసేన నగరఅధ్యక్షుడు రాజారెడ్డి, శంకర్‌గణేష్; భరత్, దివాకర్, నాగరాజు,లోకేశ్, పూస మాధవరావు, ఆముదాల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు

### జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల...

# భూసేకరణ వేగవంతం చేయాలి : కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, డిసెంబర్ 17 ప్రభాతవార్త: జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, తిరుపతి రేణిగుంట బైపాస్ రోడ్డుకు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలపై, నిర్మాణ పనులపై ఎన్హెచ్ఎఐ, రెవెన్యూ సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్ట్ పనులకు, తిరుపతి రేణిగుంట బైపాస్ రోడ్డు తదితరాలకు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలపై, నిర్మాణ పురోగతిపై జెసి శుభం బన్సల్‌తో కలిసి వర్చువల్ విధానంలో ఎన్హెచ్ఎఐ పిడిలు, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్డీఓలు తిరుపతి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి రామ్మో హన్, కిరణ్మయి, భాను ప్రకాష్‌రెడ్డి సంబంధిత మండలాల తాసిల్దార్లు తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్న కడప-రేణిగుంట, తిరుపతి -మదనపల్లి, రేణిగుంట -నాయుడుపేట 6 లేన్ వంటి రహదారులు నిర్మాణం, తిరుపతి బైపాస్ (కాలూరు క్రాస్ నుండి రేణిగుంట వరకు) 6లేన్ల రహదారి వేగవంతం చేయాలని సూచించారు. అలాగే రేణిగుంట నుండి చెన్నై వరకు 4 లేన్ల రహదారి విస్తరణ పనులు కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని భూ సేకరణలో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కృష్ణపట్నం పోర్ట్ సమీపంలో నాయుడుపేట తూర్పు కనుపూరు 6 లేన్ల రహదారి 35 కి.మీ, చిల్లకూరు క్రాస్ నుండి తూర్పు కాన్పూర్ వరకు 4 లేన్ల రహదారి తూర్పు కాన్పూర్ నుండి కృష్ణపట్నం పోర్ట్ సౌత్ గేట్ 6 లేన్ల రహదారి 36 కి.మీ, తమ్మినపట్నం నుంచి నారికెళ్లపల్లెను కలుపుతూ గ్రీన్ ఫీల్డ్ రోడ్డు 4 లేన్లు, పోర్ట్ రోడ్డు పొడిగింపు 6 లేన్ల రహదారి 16 కి.మీ అభివృద్ధి పనులు కూడా టైం లైన్ మేరకు పూర్తి చేయాలనీ సూచించారు. పారిశ్రామిక రంగానికి జాతీయ రహదారుల నిర్మాణం ద్వారా మరింత సౌకర్యం కలగనున్నదనీ తెలిపారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎన్ హెచ్ అధికారులు సమన్వయంతో నిర్దేశించుకున్న లక్ష్యాలను త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, పిడి ఎన్హెచ్ఎఐ లు తిరుపతి వెంకటేష్, నెల్లూరు ఎంకే చౌదరి, చెన్నై రవీంద్రరావు, తాసిల్దార్లు, విఆర్‌ఓలు, కలెక్టరేట్ విభాగం డిటి భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

